

ధర్మాన కృష్ణదాస్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

కొత్తవి కష్టమే..



- పంచాయతీకి 20 పనులకే అనుమతి
- పెండింగ్‌వి పూర్తి చేస్తేనే కూలీలకు ఉపాధి
- లేకుంటే కష్టమే!

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పేద ప్రజలకు ఆహార భద్రత కల్పించాలన్న సంకల్పంతో ప్రారంభించిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం వివరాలు ఎన్ఐసి సాఫ్ట్‌వేర్‌లోకి మార్చిన కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలను కఠినతరం చేసింది. ఒకే పంచాయతీలో ఒకే సమయంలో 20 పనులకు మించి అదనంగా మంజూరు చేయకుండా నిబంధనలు తెచ్చింది. గతంలో ప్రారంభించిన అసంపూర్తిగా ఉన్న పనులు, ప్రస్తుతం పురోగతిలో ఉన్నవి కలిపి 20 దాటితే కొత్తవి మంజూరు చేయడానికి సాంకేతికంగా ఇకపై సాధ్యం కాదు. కొత్త పనులు మంజూరు చేయాలంటే ఇకపై కొత్త నిబంధనలు పాటించాల్సిందే.. దీంతో ఉపాధి హామీ యంత్రాం గం ప్రస్తుతం పనులు పూర్తి చేసే పనిలో నిమగ్నమైంది. గతంలో చేపట్టిన మురుగు కాలువల నిర్మాణం, సిసి రోడ్లు, మొక్కల పెంపకం, చెరువుల అభివృద్ధి తదితర పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నారు. నిబంధనల మేరకు అవకాశం ఉన్న వాటిని రద్దు చేస్తున్నారు. గ్రామంలో కొత్తవి చేపట్టడానికి అవకాశం లేక పోవడంతో కొన్ని గ్రామాల్లో కొత్త పనులకు మస్టర్లు రానందున అక్కడ వారికి పని కల్పించలేని పరిస్థితి నెలకొందని ఆ శాఖ అధికారులు చెపుతున్నారు. ఇప్పటికే గ్రామాల్లో ప్రాధాన్యత భవనాలు మినహా ఇతర పనులు చేయలేకపోతున్నారు. ఈ పరిస్థితుల్లో ఉద్యాన తోటల పెంపకం, మొక్కలు నాటడం, చెరువుల పూడిక, నర్సరీల పెంపకం తదితర పనులు చేపట్టడానికి అడ్డంకులు ఎదురవుతున్నాయి.

పురోగతిలో 20 కంటే అధికమే..

జిల్లాల్లో ప్రతి పంచాయతీలోనూ 20 పనుల కంటే ఎక్కువ పురోగతిలో ఉన్నాయి. ప్రభుత్వం ప్రాధాన్యతగా చేపట్టిన రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, డిజిటల్ గ్రంథాలయాలు, బల్క్‌మిల్క్ కేంద్రాలు, అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటితోపాటు గతంలో ప్రారంభించిన సిసి రోడ్లు, మురుగు కాలువలు, తదితర పనులు పూర్తికాకుండా ఉన్నాయి. పంచాయతీలో ప్రాధాన్యత భవనాలు, ఇతర పనులు కలిపితే 20 కంటే ఎక్కువ ఉన్నాయి. దీంతో కొత్త పనులకు మస్టర్లు వేయడానికి సాఫ్ట్‌వేర్ అనుమతించడం లేదు. ప్రాధాన్యత భవనాలకు సామగ్రి విభాగం కింద నిధుల లభ్యత తగ్గడంతో నత్తనడకన సాగుతున్నాయి. దీంతో రద్దు, పూర్తి చేయడానికి అవకాశమున్న పనులను పంచాయతీ వారీగా గుర్తించి వాటిపై దృష్టిసారించాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశించారు. మరోవైపు 30శాతం కంటే తక్కువ జరిగిన పనులు ఇక చేసే పరిస్థితి లేకపోవడంతో అంచనాలను రివైజ్ చేసి 30శాతం కంటే ఎక్కువ పని జరిగినట్లు చూపి రద్దు చేస్తున్నారు. అయినా 20 పనులు పురోగతిలో ఉన్నట్లయితే అందులో కూలీలతో చేయించిన పనులను గుర్తించి అక్కడ పని కల్పిస్తున్నారు. ఉపాధి హామీ చట్టం కింద 2019 నుంచి 2022 వరకు మూడేళ్ల పాటు చేపట్టిన కొన్ని పనులకు ఇప్పటికీ బిల్లులు చెల్లించలేదు. ఇలాంటివి పూర్తయినట్లు చూపి మూసేస్తే సాంకేతికంగా బిల్లులు చెల్లించడానికి సాధ్యం కాదు. దీంతో వీటిని పెండింగ్‌లో ఉన్నట్లు చూపుతున్నారు. ప్రభుత్వ విభాగాల వారీగా పెండింగ్ వివరాలను సేకరించి స్వల్ప మొత్తం మాత్రమే బిల్లులు రావాల్సిన చోట వాటిని మూసేస్తున్నారు. రూ.లక్ష విలువైన అంచనాతో పని ప్రారంభించి రూ.10వేల విలువైన పనిచేసి ఆపేస్తే పురోగతి పదిశాతమే ఉన్నందున మూసేయడం వీలుకాదు. ఈ నేపథ్యం లో అంచనాలు సవరించి సదరు పని విలువ రూ.20వేలకు కుదించి రూ.10వేల పని చేసినందున 50 శాతం పని జరిగినట్లు చూపి మూసేస్తున్నారు. నెల నుంచి అసంపూర్తి పనులు పూర్తిచేయడం, కొన్ని పనులు మూసివేయడంపైనే ఉపాది హామీ ఉద్యోగులు నిమగ్నమయ్యారు. దీంతో గ్రామాల్లో ఉపాధి హామీ పనులు నిలిచి పోతున్నాయని కూలీలు ఆందోళన చెందుతున్నారు.

25న జిల్లాకు సిఎం రాక?

రెండో విడత భూ సర్వే ప్రారంభానికి వస్తారంటూ ప్రచారం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈనెల 25న శ్రీకాకుళం జిల్లాకు రానున్నారని తెలిసింది. జిల్లా పర్యటనకు సంబంధించి సిసిఎల్ఎ నుంచి జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కు ప్రాథమిక సమాచారం చేరింది. నరసన్నపేట నియోజకవర్గంలో ఏదో ఒకచోట జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష(రీ సర్వే) రెండో విడత ప్రారంభానికి ఆయన శ్రీకారం చుట్టనున్నారని అధికారుల్లో చర్చ నడుస్తోంది. ఈ అంశంపై శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో నరసన్నపేట ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ సిఎం ధర్మాన కృష్ణదాస్‌తో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమాల విషయాన్ని ఈ సందర్భంగా చర్చించారు. తామరాపల్లిలో సభ నిర్వహణకు అనువుగా ఉంటుందని ప్రాథమిక అంచనాకు వచ్చారు. సభా నిర్వహణ ఏర్పాట్లు, హెలీప్యాడ్, తదితర అంశాలను సోమవారం మధ్యాహ్నం క్షేత్రస్థాయిలో పరిశీలించాలని నిర్ణయించారు.

డిసెంబర్ నెలాఖరులో భావనపాడు పోర్టుకు శంకుస్థాపన, ఉద్దానం మంచినీటి పథకం ప్రారంభోత్సవానికి కూడా ముఖ్యమంత్రి వచ్చే అవకాశాలు ఉండొచ్చని ఇరువురి మధ్య సమావేశంలో చర్చకు వచ్చినట్లు తెలిసింది. సమావేశంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేచురల్ గ్యాస్ పైపులైను ప్రారంభం

మెళియాపుట్టి: మండలంలోని గోకర్ణపురం వద్ద రూ.2,658 కోట్లతో అంగుల్ నేచురల్ గ్యాస్ పైపులైనును విశాఖలో పిఎం మోడీ వర్చువల్ పద్ధతిలో శిలా ఫలకాన్ని శనివారం ప్రారంభించారు. గెయిల్ ఇండియా లిమిటెడ్ నిర్మిస్తున్న 745 కిలోమీటర్ల పొడవైన ఈ పైపులైన్‌ను ఆంధ్రాలోని శ్రీకాకుళంలో 125 కి॥మీ, ఒడిశాలో 620 కి॥మీ నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పాల్గొని మాట్లాడారు. రైతులకు పూర్తి నష్టపరిహారం చెల్లించిన తరువాతే పైపులైను పనులు చేయడం జరుగుతుందన్నారు. ఆయనతోపాటు ఎస్‌పి జిఆర్.రాధిక, గెయిల్ ఇండియా లిమిటెడ్ యాజమాన్య ప్రతినిధులు, తహశీల్దార్ సరోజని, ఎంపిడిఒ చంద్రకుమారి, పలువురు అధికారులు పాల్గొన్నారు.



పైపులైన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

మోడీ పర్యటనతో ఒరిగిందేమీ లేదు

- రాష్ట్రానికి ఇచ్చిన హామీల ప్రస్తావనే లేదు
- రెండో రోజు వామపక్ష పార్టీల నిరసన

ప్రజాశక్తి - కోటబొమ్మాళి, సోంపేట

విశాఖలో మోడీ పర్యటనతో ఒరిగిందేమీ లేదని వామపక్ష పార్టీల నాయకులు హెచ్.ఈశ్వరరావు, సంగారు లక్ష్మీనారాయణ, సాలీన నారాయణస్వామి విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వమే నిర్వహించాలని, రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన విభజన హామీలు నెరవేర్చాలని, ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. శనివారం మోడీ గో బ్యాక్ అంటూ వామపక్ష పార్టీల నాయకుల ఆధ్వర్యాన కోటబొమ్మాళిలో రైతు బజారు నుంచి కొత్తపేట కూడలి వరకు, సోంపేటలో బస్టాండ్ నుంచి గాంధీ మండపం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. మోడీ పర్యటనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం చేసిన మోడీ ఏ ముఖం పెట్టుకొని వచ్చారని ప్రశ్నించారు. విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను ముంచేసిన ప్రధానికి సిఎం జగన్మోహన్‌రెడ్డి ఎలా స్వాగతం పలుకుతారని ప్రశ్నించారు. విశాఖ రైల్వే డివిజన్‌తో కూడిన జోన్‌ను ప్రకటించాలని, కార్మిక చట్టాలు లేబర్ కోడ్‌లుగా మార్చటాన్ని వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు హనుమంతు ఈశ్వరరావు, గొండు నీలన్న, జి.గురువులు, జె.తరిణి, ఎస్.కేశవ, టి.పాపారావు, కర్రి సింహాచలం, ఎ.లోకనాథం, జయరాం, ముఖలింగం, కె.లోకనాథం, వసంతరావు, జి.రామారావు, తదితరులు పాల్గొన్నారు.



సోంపేట: నిరసన తెలుపుతున్న నాయకులు

ఘనంగా మహిళా కళాశాల స్నాతకోత్సవం

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో శనివారం తొలి స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల స్వయంప్రతిపత్తి గుర్తింపు పొందిన తరువాత మొదటి బ్యాచ్ 2019-2022 విద్యార్థినులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీరాములు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో గౌరవ అతిథులుగా బిఆర్ఎయు విసి నిమ్మా వెంకటరావు, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్ పాల్గొని, విద్యార్థినులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల చదువు అనంతరం విద్యారులకు ఉద్యోగావకాశాలు అందిపుచ్చుకునేందుకు వీలుగా విద్యా ప్రమాణాలు పాటించాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు, ఇంటర్న్‌షిప్‌లు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆంగ్ల భాషపై పట్టు సాధించడం డిజిటల్ విద్యా విధానంలో అవగాహన పెంచుకోవాల్సిన అవసరాన్ని వారు గుర్తు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరాములు మాట్లాడుతూ తన ఆధ్వర్యాన తొలి స్నాతకోత్సవం జరగడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పట్టా పొందిన విద్యార్థులతో ప్రమాణం చేయించారు. సవర దుర్గ (బిఎ), బూరగపు సాయిలక్ష్మి (బి.కాం) అరసవిల్లి అపరంజి (బి.ఎస్‌సి) విద్యార్థినులకు బంగారు పతకాలు అందజేశారు. బొంతు అంజలి(బి.ఎ), కొర్రా ఈశ్వరమ్మ(బి.కాం.) సంబారి శ్వేత(బి.ఎస్‌సి) విద్యార్థినులకు వెండి పతకాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సిహెచ్ఎ రాజేంద్రప్రసాద్, వర్సిటీ రిజిస్ట్రార్ దేవిడ్‌కుమార్‌స్వామి, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ, జాయింట్ డైరెక్టర్ డా.సిహెచ్.తులసి, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యాశాఖ, ఆర్‌జెడి కృష్ణ, నేతాజి, జి.శంకరనారాయణ, కె.వి.ఎస్.ప్రసాద్, సీతాలక్ష్మి, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.



పట్టాలను అందజేస్తున్న విసి, ఉన్నత విద్యాశాఖ కమిషనర్

విభజన హామీలను ప్రస్తావించలేని

అసమర్థ సిఎం జగన్

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి - పొందూరు

ప్రధాని నరేంద్రమోడీ ముందు రాష్ట్ర విభజన హామీలను నేరుగా ప్రస్తావించలేని అసమర్థ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ఆరోపించారు. మండలంలో పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలను శనివారం ఆయన పరామర్శించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విభజన హామీల్లో అత్యంతకీలకమైన ప్రత్యేక హోదా, పోలవరం, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల వంటి కీలక అంశాలను ప్రధాని ముందు ప్రస్తావించడానికి ముఖ్యమంత్రి భయపడుతున్నారని అన్నారు. ఈ రోజుతో వైసిపి ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర హక్కులను కాపాడగలడనే నమ్మకం ప్రజల్లో పోయిందన్నారు. వైసిపి ప్రభుత్వంలో పెద్దలు విశాఖలో ఆస్తులను కాపాడుకోవడానికే మూడు రాజధానుల పేరుతో ప్రాంతీయ విద్వేషాలు సష్టిస్తున్నారే తప్ప వైసిపికి, ముఖ్యమంత్రికి రాష్ట్ర అభివృద్ధి అవసరం లేదని తేటతెల్లమైందని అన్నారు. ఇప్పటికే చాలామందికి వైసిపి ప్రభుత్వం ఉద్దేశం అర్థమైందని ఇంకా కళ్లు తెరవని వారికి ఈరోజు సమావేశం తేటతెల్లం చేసిందని అన్నారు. ఆయనతో పాటు పలువురు టిడిపి నాయకులు ఉన్నారు.



పరామర్శిస్తున్న రవికుమార్

ఉక్కు పరిరక్షణ వేదిక కూల్చడం దారుణం

పలాస: విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఏర్పాటు చేసుకున్న ఉక్కు పరిరక్షణ వేదికను కూల్చడంపై వామపక్ష పార్టీలు పలాస ఆర్‌డిఒ కార్యాలయం వద్ద శనివారం నిరసన తెలిపారు. సిపిఎం నాయకులు బి.ఆనందరావు, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు బొడ్డు వాసుదేవరావు ఆర్‌డిఒ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ అర్జున్‌కుమార్ పాత్రోకు శనివారం వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ 25 మంది ఎంపీలు మాకు గానీ వస్తే కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా, మెడలువంచి ప్రత్యేక హోదా సాధిస్తామని చెప్పిన జగన్ బిజెపి ప్రభుత్వం ముందు మోకరిల్లడం సిగ్గుచేటని అన్నారు. ప్రత్యేక హోదా, విశాఖ రైల్వే జోన్ హామీలను విస్మరించడమే కాకుండా స్టీల్ ప్లాంట్ అమ్మకానికి పెట్టిన వైసిపి ప్రభుత్వం ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. వైసిపి పోరాటం చేయకుండా, బిజెపితో రాజీపడటం సరైన చర్యకాదన్నారు. బిజెపి ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ప్రకటించి రెండేళ్లు కావస్తున్నా... దాన్నీ అమలు చేయలేదన్నారు. ఆంధ్రాపై వివక్షత చూపుతున్న ప్రధానికి వైసిపి ఎర్ర తివాచీపరచి స్వాగతం పలకడంపై తీవ్రంగా మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుతానన్నా జగన్ ప్రశాంతంగా ఆందోళన చేస్తున్న శిబిరాన్ని బిజెపి మెప్పు కోసం ధ్వంసం చేయడం ప్రజాస్వామ్యవాదులందరూ తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సంగతి వైసిపి పాలకులు గమనించాలన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి ప్రత్యేక హోదా, రైల్వే జోన్ కోసం వైసిపి పోరాటం చేయకపోతే ప్రజలు తప్పకుండా గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.మోహనరావు, డి.భాస్కరరావు వంకల అప్పయ్య, సార పాపయ్య తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

మోడీ ప్రాపకం కోసం పాకులాట

ప్రజాశక్తి -శ్రీకాకుళం ప్రతినిధి



విశాఖ రాజధాని పేరుతో ఉత్తరాంధ్ర అభివృద్ధి నినాదం ఎత్తుకున్న వైసిపి ఈ ప్రాంతానికి ద్రోహం చేసిన మోడీ కోసం పాకులాడం విడ్డూరంగా ఉంది. మోడీ సభ కోసం బిజెపి కంటే వైసిపియే ఎక్కువ హడావుడి చేసింది. జనం డబ్బులతో ఆర్టీసీ బస్సులను వేసి మరీ వేలాది మంది కార్యకర్తలను తరలించి మోడీ కళ్లలో ఆనందం చూడాలని పరితపించింది. 60శాతం బస్సులను విశాఖకు పంపి, జనం ఇబ్బందులు పడినా మోడీ సంతోషం చూడాలని ఆరాటం పడింది. ఇంత చేసినా మోడీ నోట ఒక్క మంచి మాట కూడా రాలేదు. రాష్ట్రానికి, వెనుకబడ్డ ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఏం చేస్తారో కూడా విశాఖ సభలో చెప్పలేదు. రాష్ట్ర విభజన తర్వాత 2014 ఎన్నికల్లో టిడిపితో కలిసి ప్రచార సభలో పాల్గొన్న మోడీ తల్లిని చంపి బిడ్డను బతికించారంటూ ముసలికన్నీరు కార్చి ఆ తర్వాత ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ ప్రాంతం ఊసే ఎత్తలేదు. విభజన చట్టంలో పేర్కొన ప్రత్యేక హోదా, విశాఖకు రైల్వే జోన్, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాకు ప్రత్యేక ప్యాకేజీ అంశాలను అమలు చేయకుండా ఇప్పటివరకు బిజెపి ప్రభుత్వం అన్యాయం చేస్తూ వస్తోంది. 2014 ఎన్నికల తర్వాత అధికారంలో వచ్చిన టిడిపి ప్రభుత్వం కేంద్రంతో రాజీపడి రాష్ట్రానికి అన్యాయం చేసింది. ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామన్న బిజెపి ప్రభుత్వం ప్రకటించడంతో అదే పదివేలు అని సర్దుకుపోయింది. ఇతర హామీలు అమలు చేయకపోయినా పల్లెత్తుమాట అనలేదు. పైగా ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన హామీలు అమలు చేయకుండా అన్యాయం చేసిన కేంద్రం తీరుపై ఆందోళన చేసిన వామపక్షాల నాయకులను పలుమార్లు అరెస్టు చేసి గొంతెత్తనీయకుండా చేసేందుకూ నాటి టిడిపి ప్రభుత్వం ప్రయత్నించింది. రాష్ట్రానికి చంద్రబాబు అన్యాయం చేశారని, తమకు 25 మంది ఎంపీలను ఇస్తే కేంద్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా కేంద్రం మెడలు వంచి సాధిస్తామని అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం ఈ మూడేళ్లలో అడుగుడుగునా మోడీ ప్రభుత్వంతో ఏ విధంగా రాజీ పడిందో ఎవరికీ తెలియందేమీ కాదు

విశాఖకు రైల్వే జోన్, వెనుకబడిన ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజి ఇవ్వకుండా మోసం చేసిన మోడీ ప్రభుత్వం ఈ ప్రాంతానికి మరో అన్యాయం చేసేందుకు తెగబడింది. ఉత్తరాంధ్ర ఆర్థిక అభివృద్ధిలో తలమానికంగా ఉంటూ వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కును ప్రయివేటీకరించేందుకు సిద్ధమవుతోంది. లక్షల కోట్ల రూపాయాల ప్రజల ఆస్తిని దక్షిణ కొరియాకు చెందిన పోస్కో కంపెనీకి కారు చౌకగా కట్టేబెట్టేయాలని ప్రయత్నాలు సాగిస్తోంది. కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యాన విశాఖపట్నం కూర్మనపాలెం జంక్షన్లో 600 రోజులకుపైగా ఆందోళన చేస్తున్న ఉక్కు కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం విరుచుకుపడటం అందరినీ నివ్వెరపరించింది. పోలీసు బలగాలను ఉపయోగించి శిబిరంపై ప్రభుత్వం దాడికి దిగటాన్ని జనం జీర్ణించుకోలేకపోతున్నారు. విశాఖ ఉక్కు పోరాటానికి వైసిపి నాయకులు మద్దతు పలికి, అసెంబ్లీలోనూ తీర్మానం చేసిన ప్రభుత్వం, ఇప్పుడు పోరాటం శిబిరంపై దాడికి దిగటం ద్వారా వైసిపి అసలు రంగు బయటపడింది. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణపై వైసిపి ఇప్పటివరకు డబుల్ గేమ్ ఆడినట్లుగా రుజువైంది. స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ ఆ పార్టీకి పెద్ద అంశం కాదన్నట్లుగా మోడీ పర్యటనతో తేటతెల్లమైంది. అసెంబ్లీలో తీర్మానం చేసిన ప్రభుత్వం విశాఖలో శనివారం నిర్వహించిన సభా వేదికపై మాత్రం స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ అంశంపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కనీసం ప్రస్తావించకపోవడం ప్రభుత్వ చిత్తశుద్ధి ఏమిటో తెలియజేస్తోంది.

స్టీల్ ప్లాంట్ అంశంతో పాటు ప్రత్యేక హోదా, విభజన హామీలు, విశాఖకు రైల్వేజోన్, వెనుకబడిన ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వకుండా అన్యాయం చేసి ప్రజలకు ఆవేదన మిగిల్చిన మోడీని సంతోషపరిచేందుకు వైసిపి ప్రభుత్వం పరితపించడం జుగప్సాకరంగా ఉంది. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై ఉన్న కేసుల నుంచి బయట పడేందుకే మోడీకి ప్రభుత్వం సాగిలపడుతోందని, సామాన్యులు సైతం అనుకునేలా వైసిపి తీరు ఉంది.

విశాఖలో మోడీ పర్యటనపై టిడిపి కూడా పల్లెత్తుమాట అనకుండా మౌనం వహించింది. ప్రధానిపై విమర్శలు చేసి బిజెపి దృష్టిలో చెడ్డవ్వకుండా జాగ్రత్తపడింది. రాష్ట్ర ప్రయోజనాల మాట ఎలా ఉన్నా తన రాజకీయ ప్రయోజనాలే పరమావధిగా భావించింది. విశాఖ వస్తున్న మోడీ రాష్ట్రానికి ఇవ్వాల్సిన ప్రత్యేక హోదా, విభజన చట్టం హామీలు అమలు చేయాలని కనీసం డిమాండ్ చేయలేదు. అధికారంలో ఉన్న వైసిపి మోడీని నిలదీయలేక రాజీపడుతున్నా వచ్చిన అవకాశాన్ని టిడిపి కూడా అందిపుచ్చుకోలేకపోతోంది. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా టిడిపి మద్దతు పలికినా పోరాట శిబిరంపై ప్రభుత్వ దాడిని కనీసం ఖండించనూ లేదు. ప్రయివేటకరణపై మోడీని విమర్శించనూ లేదు. ఈ విషయంలో టిడిపి పాత్ర ఏమిటో వేరే చెప్పనక్కర్లేదు. ప్రత్యేక హోదా, విభజన హామీలు, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ అంశాల్లో వామపక్షాలు, ముఖ్యంగా సిపిఎం తొలి నుంచి పోరాట పంథానే అనుసరిస్తున్నాయి. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత 2014లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎపికి అన్యాయం చేసిన నాటి నుంచి నేటి వరకు వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగిస్తునే ఉన్నాయి. తాజాగా మోడీ విశాఖకు వస్తున్న నేపథ్యంలో విభజన హామీలు, స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ, తదితర డిమాండ్లపై ప్రధాని నోరు విప్పాలంటూ జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టి ప్రజల తరుపున గొంతెత్తాయి. రాష్ట్రానికి అన్యాయం చేస్తోందెవరో, ప్రజల తరుపున నిలబడి పోరాడుతుందెవరో అన్ని విషయాలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు. రాజకీయ పార్టీలు ఇప్పటికైనా తమ వైఖరిని మార్చుకుని రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న బిజెపిపై సమిష్టిగా పోరాడి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకోవాల్సిన బాధ్యత వారిపై ఉంది.



బియ్యం అందజేస్తున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

బాధితులను ఆదుకోవాలి : ఎంపీ

ప్రజాశక్తి- పోలాకి

మండలంలోని గుప్పిడిపేట అగ్నిబాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో శనివారం బాధితులను పరామర్శించారు. ఇంటింటికీ వెళ్లి బాధితుల కష్టాలను, ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. భవాని ఛారిటబుల్ ట్రస్టు ద్వారా బాధితులకు బియ్యం, వంట సామగ్రి, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్తులంతా మత్స్యకారులు వేటకు వెళ్లి కష్టపడి వచ్చే డబ్బులతో జీవనం సాగిస్తూ ఉంటారన్నారు. ఇటువంటి తరుణంలో 25 కుటుంబాలు ఇళ్లు కోల్పోయి నిరాశ్రయులు కావడం బాధాకరంగా ఉందన్నారు. కలెక్టర్‌తో మాట్లాడి అందరికీ పక్కా ఇళ్లు నిర్మించి ఇచ్చేలా కృషి చేస్తానని భరోసాఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లబ్బ ధనలక్ష్మి, తెలుగు యువత అధ్యక్షులు మెండ దాసునాయిడు, మండల టిడిపి నాయకులు కిల్లి వేణు, ఎం.వెంకట అప్పలనాయుడు, భైరి భాస్కరరావు, చిట్టి సింహాచలం, ఎ.త్రినాథరావు, డోల ప్రసాదరావు పాల్గొన్నారు.

ప్రధానిని కలిసిన 'ఎన్ఇఆర్'

ప్రజాశక్తి- రణస్థలం రూరల్



ప్రధానికి నమస్కరిస్తున్న 'ఎన్ఇఆర్'

ఎచ్చెర్ల నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ ఇన్‌ఛార్జి నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్)తో ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో రెండు నిమిషాల పాటు ముచ్చటించారు. విశాఖ పర్యటనకు వచ్చిన ప్రధానిని ఐఎంఎస్ చోళ వేదికగా నేరుగా కలిసేందుకు ఎన్ఇఆర్‌కు అనుమతి ఇచ్చారు. వీరిద్దరూ ముచ్చట్టిస్తుండగానే వైబ్రేషన్‌లో ఉన్న ఎన్ఇఆర్ ఫోన్ రింగ్ అయ్యింది. 'మీ ఫోన్ రింగ్ అవుతున్నట్లు ఉంది' అంటూ ఆయనతో ప్రధాని చెప్పారు. ప్రధాని సూక్ష్మ పరిశీలన చూసి ఆశ్చర్యపోవడం అక్కడి వారివంతైంది. హిందీ, ఇంగ్లీష్ భాషలతోపాటు అన్ని భాషపైనా పట్టు ఉన్న ఎన్ఇఆర్ తన వాక్‌ధాటితో పలు అంశాలను చర్చించి మోడీ మనసుని ఆకట్టుకున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని ఈ సందర్భంగా ప్రధాని ఎన్ఇఆర్‌కు సూచించారు.

అంగన్వాడీ ఆయా పోస్టుకు రాజకీయ గండం

● ఒక్క పోస్టుకు ఇద్దరు పోటీ

● అన్నీ తానై పనిచేస్తున్న కార్యకర్త

ప్రజాశక్తి- పలాస

ఆ అంగన్వాడీ కేంద్రానికి ఆయా పోస్టు దినదిన గండంగా మారింది. ఒక పోస్టుకు ఇద్దరు మహిళలు పోటీపడుతుండగా ఒక్కొక్కరికి ఒక్కో రాజకీయ నాయకులు సిఫార్సు చేస్తుండడంతో అధికారులకు తలనొప్పిగా మారింది. ఒక్క మాటలో చెప్పాలంటే ఆ కేంద్రం ఆయా పోస్టుకు రాజకీయ గ్రహణం పట్టిందని చెప్పాలి. రెండేళ్లుగా ఆ కేంద్రంలో ఆయా లేకపోవడంతో పిల్లలు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కాశీబుగ్గ సూదికొండ కాలనీలో సూర్య కాలనీ, సాయిబాబ కాలనీ, నేతాజీనగర్ తదితర ప్రాంతాలకు అంగన్వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అంగన్వాడీ కేంద్రంలో 20 మంది చిన్నారులు, గర్భిణులు, బాలింతలు వస్తుంటారు. మూడు నుంచి ఆరేళ్ల పిల్లలకు చదువుతోపాటు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం అందిస్తున్నారు. అయితే అంగన్వాడీ కేంద్రంలో ఆయా లేకపోవడంతో పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంగన్వాడీ కార్యకర్త అన్ని తానై పిల్లలకు ఆహారం పెట్టడంతో పాటు చదువు చెప్పడం చేస్తున్నారు. ఇదిలా ఉండగా కరోనా సమయంలో అంగన్వాడీ కేంద్రంలో పనిచేసిన ఆయా సలమ్మ పనిభారం ఎక్కువగా ఉందని,



పిల్లలకు చదువు చెబుతున్న అంగన్వాడీ కార్యకర్త

తాను పని చేయలేనని తన ఆయా పోస్టును విడిచిపెట్టి వెళ్లిపోయింది. అప్పటి నుంచి అంగన్వాడీ కేంద్రంలో ఆయా లేకపోవడంతో పిల్లలు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు అంగన్వాడీ కార్యకర్తకు పనిభారం పెరుగుతుంది. పిల్లలకు ఒక వైపు చదువు చెప్పడం, మరోవైపు పిల్లలకు ఆహారం పెట్టడం, మరోవైపు బాలింతలకు, గర్భిణులకు సేవలు అందించడం కష్టంగా ఉందని అంగన్వాడీ కార్యకర్త ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాజకీయ రంగు

అంగన్వాడీ కేంద్రంలో ఆయా పోస్టు ఖాళీగా ఉండడంతో ప్రభుత్వం సెప్టెంబరు ఒకటిన నోటిఫికేషన్ వేసింది. ఆయా పోస్టు నియామకానికి విద్యా అర్హత 7వ తరగతి ఉత్తీర్ణత అవసరం. అయితే అదే ప్రాంతానికి చెందిన జి.హేమలత, ఎ.సుజాత దరఖాస్తులు చేసుకున్నారు. ఇరువురికి అర్హత కలిగి ఉన్నారు. అధికారులు ఇరువురికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇదిలా ఉండగా సుజాతకు ఆయా పోస్టు ఇవ్వాలని మున్సిపల్ ప్రతినిధి సిఫార్సు చేస్తుండగా, హేమలతకు మరో కౌన్సిలర్ ప్రతినిధి సిఫార్సు చేస్తున్నారు. ఈ పంచాయతీ నియోజకవర్గ కీలక నేత దృష్టికి వెళ్లింది. మున్సిపల్ ప్రతినిధి తమకు చెందిన వ్యక్తికి ఇవ్వాలని, లేదు లేదు తమకు చెందిన వ్యక్తికి ఇవ్వాలని ఇద్దరూ రాజకీయ నాయకులు పోటాపోటీ పడుతున్నారు. దీంతో ఆయా పోస్టు ఎవరికి కేటాయించాలో తెలియక అధికారులు సందిగ్ధంలో పడ్డారు. అన్ని ప్రాంతాల్లో ఇప్పటికే పోస్టులు కేటాయింపు పూర్తి కాగా, ఈ అంగన్వాడీ కేంద్రానికి ఆయా పోస్టు కేటాయింపు చేపట్టలేదు. గతేడాదీ అధికారులు ఆయా పోస్టు నియామకానికి నోటిఫికేషన్ జారీ చేయగా, అప్పుడూ ఇదే పరిస్థితి కొనసాగడంతో ఖాళీగా మిగిలిపోయింది. మరలా ఈ ఏడాది నోటిఫికేషన్ వేశారు. అర్హులైన ఆయాలు ఉన్నప్పటికీ కేటాయింపు జరగడం లేదు. నియోజవర్గ కీలక నేత ఆదేశాల కోసం జిల్లా అధికారులు చూస్తున్నారని సమాచారం. ఏది ఏమైనప్పటికీ రాజకీయ నాయకుల ఒత్తిడి మధ్య పోస్టు నియమించడం జరగలేదనే చెప్పాలి. ఈ విషయంపై కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిణి శార్వాణిని వివరణ కోరగా, అంగన్వాడీ ఆయా పోస్టుకు ఇద్దరు దరఖాస్తులు చేసుకున్నారని, ఇద్దరికీ ఇంటర్వ్యూలు నిర్వహించామని తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, ఎవ్వరిని నియమిస్తే వారిని ఆయా వేస్తామని తెలిపారు. ప్రస్తుతం ఆయా లేకపోవడంతో అక్కడ ప్రజలు, చిన్నారులు ఇబ్బందులు పడడం వాస్తవమన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

దళిత మహిళ బండారి మంజుపై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పురపాలక సంఘం ఒకటవ వార్డు పరిధిలోని బైరి శాస్త్రులపేటలో బాధితురాలిని పరామర్శించారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంజు మాట్లాడుతూ తన భర్త సాయిరాం, తనది కులాంతర వివాహమని, ఆయనకు చెందిన 1.20 సెంట్ల భూమి తల్లి ద్వారా సంక్రమించిందని తెలిపారు. ఈనెల 8వ తేదీన గ్రామంలో భూ రీ సర్వే జరుగుతుండటంతో తమ గ్రామంలోని వార్డు వాలంటీర్ లంక పవన్ కళ్యాణ్ ఒడిశాలో నివాసం ఉంటున్న నా భర్త మేనమామ బుంగ మురళికి ఫోన్ చేసి నీ పేరున ఇక్కడ పొలం ఉందని చెప్పి రప్పించి, అందరూ కలిసి భూమి తాలూకా కాగితాలు అడిగారని, మేము ఇవ్వకపోయేసరికి కులం పేరుతో దూషించి కర్రలతో దాడి చేసి గాయపరిచారని కన్నీరు మున్నీరుగా విలపించింది. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ మాకుమ్మడిగా దాడి చేసి గాయపరిచి కులం పేరుతో దూషించడం దారుణమన్నారు. చట్టాలు ఎన్ని ఉన్నా దళితులపై దాడులు ఆగడం లేదన్నారు. పాలకపక్షం శిక్షలు కఠినంగా అమలు చేస్తే తప్ప దాడులు ఆగవని అన్నారు. పోలీసులు నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ దళిత జెఎసి నాయకులు ఆమెను పరామర్శించి సంఘీభావం తెలిపారు. నిందితులు మొండేటి కుర్మారావు, లంక ఆదినారాయణ,



బాధితురాలిని పరామర్శిస్తున్న రవికుమార్

పవన్ కళ్యాణ్, రామరాజు, శారద, బుంగ మురళిలను వెంటనే అరెస్టు చేయాలని లేనిపక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పరామర్శించిన వారిలో టిడిపి యువ నాయకుడు మొదలవలస హర్ష, దళిత సంఘాల జెఎసి నాయకులు లోపింటి నారాయణరావు, గొల్లపిల్లి నందేశ్, బొత్స వెంకటరమణ, కోనాడ రామారావు, వన్నల లక్ష్మీనారాయణ, నీలం నాయుడు, మన్నెన శంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

రైలు పట్టాలపై వ్యక్తి మృతదేహం

జి.సిగడాం : జి.సిగడాం-చీపురుపల్లి రైల్వే స్టేషన్ల మధ్య బాతువ గ్రామ సమీపంలో శనపివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని జిఆర్ఆర్‌ఫి ఎస్ఐ చెల్లూరి శ్రీనివాస్ తెలిపారు. రైలు నుంచి జారిపడి గాని, రైలు ఢీకొని గాని మృతి చెంది ఉంటాడని భావిస్తున్నామని అన్నారు. మృతుడి వయసు 45 నుంచి 50 ఉంటుందన్నారు. మృతుడు ఎడమ చేయిపై డికెకె అనే పచ్చబొట్టు ఉందన్నారు. గుర్తించిన వారు 7013273731 నంబరుకు ఫోన్ చేయాలని తెలిపారు.



రైలు పట్టాలపై ఉన్న మృతదేహం

పెద్దలక్ష్మీపురంలో విషాదం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని పెద్దలక్ష్మీపురానికి చెందిన మడపాల గణపతిరావు (36) శనివారం హైదరాబాదులో మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి. ఉపాధి నిమిత్తం మూడు నెలల కిందట పిల్లలను ఇక్కడ విడిచిపెట్టి భార్యతో వలస వెళ్లాడు. శనివారం తన ఇంటి మరుగుదొడ్డిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు కన్నీరమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడికి రమాదేవి, 9వ తరగతి చదువుతున్న కుమారుడు రోహిత్, ఐదో తరగతి చదువుతున్న కుమార్తె హర్షిత ఉన్నారు.



గణపతిరావు మృతదేహం

ఎఎస్ఐకి గాయాలు

ప్రజాశక్తి- కవిటి

కవిటి ఎఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న దిండి భాస్కరరావు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. శనివారం విశాఖపట్నం నుంచి కవిటి ద్విచక్ర వాహనంపై వస్తుండగా, ఎచ్చెర్ల మండలం జిల్లా చిలకపాలెం సమీపంలో డివైడర్‌ను ఢీకొని గాయపడ్డారు. కవిటి ఎస్ఐ రాము అందించిన సమాచారం మేరకు శనివారం విశాఖపట్నంలో జరిగిన ప్రధాని మోది సభకు బందోబస్తుకు భాస్కరరావు వెళ్లారు. సభ ముగిసిన అనంతరం తిరుగు ప్రయాణంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వెంటనే స్థానికులు 108లో జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు.



గాయపడిన ఎఎస్ఐ భాస్కరరావు



మధు మృతదేహం

పాముకాటుతో రైతు మృతి

ప్రజాశక్తి- జలుమూరు

పాము కాటుకు గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు కథనం మేరకు... మండలంలోని గొటివాడకు చెందిన నేతింటి మధు (27) చల్లవానిపేట గ్రామ సమీపంలో ఓ వ్యవసాయ పొలంలో వరి కోత మిషన్‌తో కోత కోస్తుండగా పాము కాటుకు గురై అస్వస్థతకు లోనయ్యాడు. వెంటనే చుట్టు పక్కల పొలాల్లో ఉన్న వ్యక్తులు పొలం వద్ద నుంచి రోడ్డు వరకు మోసుకుంటూ తీసుకువచ్చి కారులో నరసన్నపేటలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా, అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. దీంతో ఒక్కసారిగా కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య లత, కుమారుడు చరణ్‌తేజ ఉన్నారు. ఎస్‌పి పి.పారినాయుడును వివరణ కోరగా, ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఉపాధ్యాయునికి అస్వస్థత

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలంలోని కొల్లిపాడు మండల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు అరసవల్లి గణపతి శనివారం అస్వస్థతకు గురయ్యారు. తరగతిలో విద్యార్థులకు పాఠాలు చెబుతుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దీంతో పాఠశాల హెచ్‌ఎం కుమారస్వామి స్థానికంగా ప్రథమ చికిత్స చేయించి, నరసన్నపేట ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఉపాధ్యాయుడు గణపతి ఆరోగ్యం స్థిరంగా ఉన్నట్లు తోటి ఉపాధ్యాయులు తెలిపారు.

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

ప్రజాశక్తి- సోంపేట

భవన నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపిపి డాక్టర్ నిమ్మాన దాసు అన్నారు. మండలంలోని బారువాలోని పిహెచ్‌సిని 30 పడకల సామాజిక ఆస్పత్రిగా ప్రభుత్వం మార్పు చేసింది. ఈ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజిక ఆస్పత్రి భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి రోగులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం సాంఘిక సంక్షేమ ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని సందర్శించి పరిశీలించారు. వసతి గృహంలో విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతులపై ఆరా తీశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి గుత్రాల శ్రీను, సర్పంచ్ ఎర్ర రజిని తారకేశ్వరరావు, ఎంపిటిసి తామాడ బుజ్జి, చంద్రశేఖర్, బత్తుల బాబూరావు, భువనేశ్వర్ పాణిగ్రాహి, కర్రి సత్యం, వార్డు మెంబర్లు ఈశ్వరి, అమర లోకనాథం, శంకర్రావు, మాధవరావు, సింహాచలం, అబ్బులు, హాస్టల్ వార్డెన్ రవి తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎంపిపి దాసు

'ములాయం' సంస్మరణ సభలో శిరీష



సంస్మరణ సభలో పాల్గొన్న శిరీష

ప్రజాశక్తి- పలాస

ములాయం సింగ్ యాదవ్ సంస్మరణ సభలో పాల్గొవడం ఆనందంగా ఉందని టిడిపి ప్రధాన రాష్ట్ర కార్యదర్శి గౌతు శిరీష పేర్కొన్నారు. రాజకీయాల్లో ఎవరు అందుకోలేని స్థాయిలోకి వెళ్లిన మొట్టమొదటి బిసి నాయకుడు ఆయన అని తెలియజేశారు. సర్దార్ గౌతు లచ్చన్నతో మంచి సంబంధాలు ఉన్న వ్యక్తి, ఆ రోజుల్లో రాజనీతి శాస్త్రంలో ఉన్నతమైన చదువులు చదివిన వ్యక్తి అని కొనియాడారు. చివరి శ్వసవరకు రాజకీయాల్లో ఉన్న ఏకైక వ్యక్తి ములాయం సింగ్ యాదవ్ అని పేర్కొన్నారు. అటువంటి వ్యక్తి ఒక బిసి అవ్వడం గర్వించదగ్గ విషయమమన్నారు. బిసిలు అందరు ఐకమత్యంగా ఉండాలని సర్దార్ గౌతు లచ్చన్న కోరుకునే వారని అన్నారు. అన్ని పార్టీల బిసి నాయకులను ఒకదగ్గర చేర్చడం ఆనందంగా ఉందని ఆనందాన్ని వ్యక్తం చేశారు.

టెక్కలి ప్రెస్‌క్లబ్ అధ్యక్షునిగా సుదర్శనరావు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

స్థానిక బిఎస్‌జెఆర్ కళాశాలలో శనివారం నిర్వహించిన ప్రెస్‌క్లబ్ ఎన్నికలో ప్రజాశక్తి విలేకరి కూన సుదర్శనరావు అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో బెండి నర్సింగరావుపై ఐదు ఓట్లు మెజారిటీతో గెలిపొందారు. మొత్తం 56 ఓట్లకు గాను నర్సింగరావుకు 25, సుదర్శనరావుకు 30 ఓట్లు రావడంతో విజయం సాధించారు, అలాగే ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శిగా ముగ్గురు పోటీ చేశారు. నర్సిపురం శేఖర్ 28, కొంచాడ సోమేశ్వరరావు 15, కుప్పిలి ఉదయ్ కుమార్‌కు 11 ఓట్లు పోలయ్యాయి. దీంతో 13 ఓట్లు మెజారిటీతో నర్సిపురం శేఖర్ విజయం సాధించారు. గౌరవ అధ్యక్షులుగా పేరాడ పరమేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా సుంకు గోపి, పొట్నూరు వినాయకరావు, సహాయ కార్యదర్శిలుగా ఒడుగురు రాజేష్, హరనాథ్‌రెడ్డి, మార్పు పద్మాలోచన్, కోశాధికారిగా గనియా



నియామకపత్రం అందుకుంటున్న సుదర్శనరావు

శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులుగా లింగుడు రమణ, వట్టికోల కీర్తికుమార్, పేరా మురళి, సరోజిని, పాలతీర్థపు గిరీశ్వరరావులు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల నిర్వహణ అధికారులుగా కోత మధుసూదనరావు, కర్రి శంకర్‌రెడ్డి వ్యవహరించారు. ఈ ఎన్నికలు బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించారు. సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలు, వారి అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

కామ్రేడ్ రోహిణి సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న లింగరాజు

ప్రజాశక్తి- సోంపేట

కామ్రేడ్ రోహిణి మామిడిపల్లి గ్రామానికి చేసిన సేవలు మరువలేనివని గ్రామ రైతు సంఘం అధ్యక్షులు గోరకల లింగరాజు అన్నారు. కామ్రేడ్ రోహిణి నాలుగో వర్ధంతిని మామిడిపల్లిలో శనివారం నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గ్రామ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి మర్రి లోకనాథం, తిమ్మల వీరాస్వామి, సిపిఎం సీనియర్ నాయకులు కృష్ణమూర్తి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సంగారు లక్ష్మీనారాయణ, జిత్తు సింహాచలం, విశాఖ స్టీల్ ప్లాంట్ సిఐటియు నాయకులు సింహాచలం, మహిళా సంఘం నాయకులు మర్రి ఇందిర, తెప్పలు జేజమ్మ, గోరకల నిర్మల పాల్గొన్నారు.

టిడిపి సంఘీభావ పాదయాత్ర

ప్రజాశక్తి- రణస్థలం

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జనవరి 27 నుంచి శ్రీకారం చుట్టిన పాదయాత్రకు సంఘీభావంగా శనివారం ఎచ్చెర్ల నియోజకవర్గ టిడిపి నాయకులు స్థానిక జాతీయ రహదారిపై రెండు కిలో మీటర్లు పాదయాత్ర శనివారం చేపట్టారు. ముందుగా ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి సీనియర్ నాయకులు, పొందూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కలిశెట్టి అప్పలనాయుడు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోకేష్ పాదయాత్రకు శ్రీకారం చుట్టడం శుభపరిణామమని అన్నారు.



పాదయాత్ర చేస్తున్న టిడిపి నాయకులు

ఈ పాదయాత్రలో 175 నియోజకవర్గాలను కలుపుతూ రూట్ మ్యాప్ సిద్ధం చేయడంతో టిడిపి కేడర్ నూతనోత్సాహంతో ఉందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'నాడు-నేడు' పనుల పరిశీలన



ఆమదాలవలస : పనులను పరిశీలిస్తున్న ఎపిఎం కూర్మారావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించే ఉద్దేశంతో చేపడుతున్న నాడు-నేడు పథకంలో తల్లిదండ్రుల కమిటీల ద్వారా అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు మండల విద్య, సంక్షేమాధికారి, ఎపిఎం పైడి కూర్మారావు తెలిపారు. మండలంలోని రామచంద్రాపురం పంచాయతీ పరిధిలోని పొన్నాంపేట పాఠశాలలో చేపడుతున్న నాడు-నేడు పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పనినీ ప్రధానోపాధ్యాయులతో పాటు, పేరెంట్స్ కమిటీ దగ్గర ఉండి పర్యవేక్షించాలని సూచించారు. ఇంజినీరింగ్ సహాయకుల సూచనల మేరకు నాణ్యత పాటించాలన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా నాణ్యత పాటిస్తూ, మన పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా, సకల సౌకర్యాలతో సర్వతో ముఖాభివృద్ధి సాధించాలని అన్నారు. బాల బాలికలకు వేర్వేరుగా మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. నిత్యం నీటి సౌకర్యంతో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. జగనన్న గోరుముద్ద భోజనశాలలో చక్కని వెంటిలేషన్ సౌకర్యం ఉండేటట్లు చూడాలన్నారు. పాఠశాల పరిసరాలు పిల్లలకు ఆహ్లాదకరంగా ఉండాలన్నారు.

స్కూల్ బ్యాగు, యూనిఫాంలు, బూట్లు అందరూ ధరించేటట్లు తల్లిదండ్రుల కమిటీలతో మాట్లాడి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాగ్యలక్ష్మి, మధ్యాహ్న భోజన సహాయకులు రమణమ్మ, క్లస్టర్ కో-ఆర్డినేటర్ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పలాస : ఎస్ఇఆర్‌పి రెగ్యులర్ ఉద్యోగ కార్యక్రమాలో పాటు నాడు-నేడు, అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, స్కూల్ మరుగుదొడ్లు, స్కూల్స్ నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం ఎపిఎంకు అప్పగించిందని ఎంఇఒ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ఎంఇఒ కార్యాలయంలో నాడు-నేడు పనులపై హెచ్‌ఎంలు, అసిస్టెంట్ ఇంజినీర్లు, పేరెంట్స్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎం మల్లేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో పలాస మండలం నిలిచేందుకు అందరం కలిసి కట్టుగా కృషి చేస్తామని అన్నారు.

'అంగన్వాడీ' సమస్యలపై పోరాడుదాం

ప్రజాశక్తి- పలాస

రోజు రోజుకూ అంగన్వాడీల సమస్యలు పెరుగుతున్నాయని, సమస్యలు పరిష్కారానికి అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు ఐక్యం కావాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.సుదర్శనం పిలుపునిచ్చారు. కాశీబుగ్గ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మహాసభ మండల అధ్యక్షులు బి.ఆదిలక్ష్మి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐసిడిఎస్‌ను పరిరక్షించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అంగన్వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్ సౌకర్యం కల్పించాలని, జీతంలో సగం పెన్షన్‌లో ఇవ్వాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.25 వేలు ఇవ్వాలన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి మాట్లాడుతూ పనిభారం తగ్గించి పనికితగ్గ వేతనం ఇవ్వాలన్నారు. పెరుగుతున్న సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. యూనియన్ కార్యకలాపాల నివేదిక కార్యదర్శి ఎం.మంజులాకుమారి ప్రవేశ పెట్టారు. అనంతరం



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శనం

నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా బి.ఆదిలక్ష్మి, ఎం.మంజులా కుమారి, బి.చామంతి, పి.పద్మ, జె.శైలజ, బి.సునీత, రమ, అలివేని, మల్లీశ్వరి, కె.కృష్ణవేణి, కె.సరస్వతితో పాటు 24 మందితో కమిటీ ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బి.స్వాతి, కుమారి, పుష్ప, విజయ తదితరులు పాల్గొన్నారు.

రాపాకలో అన్నదానం

పొందూరు: మండలంలోని రాపాక లో కొండపై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏటా కార్తీకమాసం మూడో శనివారం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. ఈ అన్నదాన కార్యక్రమానికి గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన యాత్రికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సంస్కృతి కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలుపాల్గొన్నారు.



అన్నదానంలో పాల్గొన్న యాత్రికులు

రేపు 'కిమ్స్'లో ఉచిత వైద్య శిబిరం

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని కిమ్స్ ఆస్పత్రిలో ఈనెల 14న ప్రపంచ డయాబిటీస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సుగర్ వ్యాధిగ్రస్తులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి మెడికల్ సూపరెండెంటు డాక్టర్ పి.ఆర్.సోమేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. జనరల్ మెడిషన్ వైద్య నిపుణులు డాక్టర్ కేదారినాథ్ పర్యవేక్షణలో బిపి, షుగర్ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. అవసరాన్ని బట్టి 2డి ఎకో, ఇసిజి పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. సాయంత్రం 4 గంటలకు కిమ్స్ వైద్యులు షుగర్ వ్యాధిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆమారపు అలవాట్లు, వ్యాయామంపై అవగాహన కల్పిస్తారని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సిఎన్‌జి సెగ్మెంట్‌కు టయోటా కిర్లోస్కర్ మోటార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తన కస్టమర్-ఫస్ట్ ఫిలాసఫీకి అనుగుణంగా, టయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెం) శనివారం ఎస్ఎన్‌జి సెగ్మెంట్లోకి తన ప్రవేశాన్ని ప్రకటించింది. తద్వారా టయోటా గ్లాంజాస్, అర్బన్ క్రూయిజర్ హైరైడర్ మోడల్ లైనప్ రెండింటిలోనూ వినియోగదారులు ఎంచుకోవడానికి మరిన్ని మోడళ్లను అందిస్తుంది. ఈ ఏడాది ప్రారంభంలో ఆవిష్కరించిన టయోటా గ్లాంజా ఇప్పుడు మాన్యువల్ ట్రాన్స్ మిషన్ పవర్ ట్రెయిన్‌తో పాటు ఎస్ అండ్ జి గ్రేడ్లలో ఎస్ఎన్‌జి వేరియంటుతో లభిస్తుంది. ఈ సెగ్మెంట్‌లో మొట్ట మొదటిసారిగా అర్బన్ క్రూయిజర్ హైరైడర్ టూ ఇప్పుడు ఎస్, జి గ్రేడ్లు రెండింటిలోనూ ఫ్యాక్టరీలోనే ఫిట్ చేసిన ఎస్ఎన్‌జి కిట్‌తో లభ్యమవుతుంది. రెండు గ్రేడ్లలో మాన్యువల్ ట్రాన్స్ మిషన్ (ఎంట)



సరికొత్త మోడల్ కారు

పవర్ ట్రెయిన్ ఉన్న ఎస్ఎన్‌టి వేరియంట్ సెల్ఫ్-ఛార్జింగ్ స్ట్రాంగ్ హైబ్రిడ్ ఎలక్ట్రిక్‌తో పాటు నియో డ్రైవ్ వేరియంట్లకు అదనంగా ఉంటుంది. ఇవి ఇప్పటికే మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. వినియోగదారుల నుంచి చాలా ప్రోత్సాహకరమైన ప్రతిస్పందనను అందుకున్నాయని పెద్దపాడు రోడ్డులోని లీలాకృష్ణ టయోటా షోరూం సంస్థ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వర్చ్యువల్ సమావేశంలో టికెం సేల్స్, స్ట్రాటజిక్ మార్కెటింగ్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ అతుల్ సూద్ మాట్లాడుతూ కస్టమర్ కేంద్రంగా ఉండే కంపెనీ కావడం వల్ల, కస్టమర్ల ఆసక్తికి పెద్దపీట వేయడాన్ని టికెం విశ్వసిస్తుందన్నారు. టయోటా వద్ద మా లక్ష్యం ఎప్పుడూ కస్టమర్ల ఆకాంక్షలపై స్పష్టమైన దృష్టి సారించిందన్నారు. తద్వారా మా కస్టమర్లకు ఆచరణీయమైన ఉత్పత్తులు, సేవలను అందించడం ద్వారా మార్కెట్ అవసరాలను తీర్చిదిద్దడమేనన్నారు. అదే దార్శనికతను దృష్టిలో ఉంచుకుని ఎస్ఎన్‌జి సెగ్మెంట్లో ప్రవేశాన్ని ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. అత్యంత డిమాండ్ ఉన్న రెండు మోడళ్ల టయోటా గ్లాంజా, అర్బన్ క్రూయిజర్ హైరైడర్ కోసం ఎస్ఎన్‌జి వేరియంట్లలో డ్రైవింగ్ అందిస్తున్నామని తెలిపారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

కపాసుకుద్దిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి- కవిటి

సొంతలాభం కొంతమానుకుని పొరుగువాడికి సాయపడవోయి అన్న గురజాడ కవితకు నిలువెత్తు నిదర్శనం ఆక్సిజన్ ఆస్పత్రి వైద్యులని కపాసుకుద్ది సర్పంచ్ కాయ దమయంతి భీమ సేన్ అన్నారు. మండలంలోని కపాసుకుద్దిలో పలాస ఆక్సిజన్ ఆస్పత్రి సౌజన్యంతో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. తీర ప్రాంతంలో ఉన్న వందలాది మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసిన ఆక్సిజన్ ఆస్పత్రి వైద్యులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నిర్వహించి వైద్య శిబిరంలో డాక్టర్ సత్తుపల్లి హేమచందర్ 200 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇటీవల గ్రామంలో జ్వరాలపై ప్రజాశక్తి వణికిస్తున్న జ్వరాలు, అడుగడుగునా అపరిశుభ్రత అంటూ కథనాలు ప్రచురితమయ్యాయి. వీటికి స్పందించిన ప్రభుత్వ యంత్రాంగం గ్రామంలో వారం రోజులు పాటు వైద్య శిబిరం నిర్వహించిన విషయం పాఠకులకు విదితమే. గ్రామానికి చెందిన ఆర్ఎంపి బి.రామారావు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో ఆస్పత్రి పిఆర్ఒ పి.సింహాచలం, డాక్టర్ సత్తుపల్లి ప్రవీణ, సత్తుపల్లి శేషయ్య, రజని, కీర్తి, శకుంతల, కావేరి, స్వప్న, రాజేష్ పాల్గొన్నారు.


ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులతో శ్రీరామ్మూర్తి

విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

విద్యార్థులు విద్యలో రాణించి తల్లిదండ్రులకు, చదువుతున్న పాఠశాలకు మంచి పేరును తీసుకురావాలని ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి అన్నారు. మండలంలోని తొగరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ మేరకు విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ సమావేశం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్.కృష్ణ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. పాఠశాల విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సకాలు ఇస్తున్న స్వర్ణోత్సవ కమిటీ చైర్మన్ కె.రవికుమార్, సెక్రటరీ కె.నాగరాజు పాల్గొన్నారు. గత సంవత్సరం నిర్వహించిన టాలెంట్ టెస్టులో ప్రతిభ కనబరిచి ఒకటి, రెండు, మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు, అలాగే ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు నగదు ప్రోత్సాహకంగా రూ.26 వేలు నగదును అందజేసి మెమెంటోలతో విద్యార్థులను సత్కరించారు. అలాగే 2019-20లో ట్రిబుల్ ఐటిలో సీటు సంపాదించిన పైడిపెద్ది రామ్‌కుమార్‌కు రూ.5 వేలు నగదును ప్రోత్సాహకంగా స్వర్ణోత్సవ కమిటీ అందజేసింది. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి తమ్మినేని చంద్రశేఖర్, విద్యా కమిటీ చైర్మన్ కె.రాఘవాచార్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం

ప్రజాశక్తి- పలాస

జాతీయ లోక్అదాలత్‌లో సులువుగా కేసులను పరిష్కరించుకోవచ్చునని పలాస సివిల్ జడ్జి పి.రవిశంకర్ అన్నారు. పలాస కోర్టులో శనివారం లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ ఓ చక్కని వేదిక అని చెప్పారు. పరిష్కరించుకోదగ్గ క్రిమినల్, సివిల్ కేసులను రాజీ చేసుకోవాలని సూచించారు. పలాసలో 1700, ఇచ్ఛాపురంలో 585 ఎస్‌టిసిలు చొప్పున పరిష్కారమైనట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు తాండ్ర మురళీమోహన్, సెక్రటరీ పిండి వెంకటరావు, న్యాయవాదులు పి.ఎల్.నారాయణ, జి.ఎం.ఎస్.అనీల్‌రాజ్, కారునాయుడు, ఎస్.వి.ఎస్.వెంకటరావు, జి.ప్రభాకరరావు, మహమ్మద్ గని, కోత రజనీకుమార్, ఎన్.విశ్వేశ్వరరావు, వి.కామేశ్వరరావు పట్నాయక్, శ్యామ్, ప్రభాకర్, తేజేశ్వరరావు, హనుమంతు దివ్య, ఉష, లక్ష్మి, ఎపిపి రమేష్, సూపరింటెండెంట్ పాణిగ్రాహి, బి.లక్ష్మణరావు, సోషల్ వర్కర్ పి.పద్మజ, పోలీసులు పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న జడ్జి రవిశంకర్

610 కేసులు పరిష్కారం

ఇచ్ఛాపురం : స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి పి.రవిశంకర్ జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో 610 కేసులు పరిష్కరించారు. దీనిలో భాగంగా రాజీ పడిన కేసులు 15, క్రిమినల్ అడ్మిషన్స్ 42, ఎస్‌టిసిలు టౌన్ న్యూసెన్స్ ఆక్టివ్, ఇతర హెచ్‌డి 523, బ్యాంకు పిఎల్‌సిలు 4, బిఎస్ఎన్ఎల్ వారికి సంబంధించిన పిఎల్‌సిలు 17 పరిష్కరించారు. ఈ కేసులకు రూ.48,010 అపరాధం రుసుంగా వసూలు చేశారు.

412 కేసులు...

టెక్కలి : కక్షిదారులు తమ సమయాన్ని సద్వినియోగం చేసుకోవడమే గాక డబ్బునీ వృథా ఖర్చు చేయనివ్వకుండా ఉండేందుకు వీలుగా ఏర్పాటు చేసిన లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి టి.హరిత పిలుపునిచ్చారు. కోర్టు ఆవరణలో లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఇందులో 412 కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. వీటిలో 77 క్రిమినల్ కేసులు, 320 పెట్టీ కేసులు, 2 మనోవర్తి కేసులు, 4 వివాహ సంబంధమైన కేసులు, 3 సివిల్ దావాలు పరిష్కారమయ్యాయని తెలిపారు. ఈ కేసుల పరిష్కారం ద్వారా రూ.8.40 లక్షలు అపరాధ రుసుం వసూలు చేశామన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి తేజ చక్రవర్తి మల్ల, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.ధర్మరాజు, లోక్ అదాలత్ సభ్యులు రమణారావు, న్యాయవాదులు ఖజానా వెంకటరావు, దివ్వల వివేకానంద, దవళ రాజేశ్వరరావు, వైకుంఠరావు పాణిగ్రాహి, పి.మధు, ఎం.బాలకృష్ణ, పొట్నూరు ఆనందరావు, నందిగాం పోలీసులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

282 కేసులు...

సోంపేట: స్థానిక కోర్టుల ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 282 కేసులు పరిష్కరించినట్లు ఎడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రాము తెలిపారు. ఇందులో భాగంగా న్యూసెన్స్ కేసులు 206, రాజీ పడిన క్రిమినల్ కేసులు 21, మనోవర్తి కేసులు రెండు, మోటార్ యాక్సిడెంట్ కేసులు మూడు, సివిల్ దావాలు మూడు, నేరం ఒప్పుకున్న కేసులు 39, బ్యాంక్ ప్రీ లిటిగేషన్ కేసులు 8 పరిష్కరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మెంబరు జోగారావు, బెనర్జీ మాస్టారు, పోలీసులు పాల్గొన్నారు.

ఎంపీ పరామర్శ

కోటబొమ్మాళి: స్థానిక రెడ్డికవీధికి చెందిన టిడిపి నాయకులు కల్లి నాగయ్యరెడ్డి, కల్లి లక్ష్మణరెడ్డిలు కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు శనివారం వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అలాగే సోమనాథపురానికి చెందిన బొడ్డాపు రమణ హైదరాబాద్‌లో ఎస్ఐగా పనిచేస్తూ అక్కడ అనుమానస్థితితో మృతి చెందడంతో రమణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన తల్లిదండ్రులను, కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే మండలం కమలనాభపురానికి చెందిన చింతాడ మురళీమోహనరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ, మండల అధ్యక్షులు బోయిన రమేష్, మెండ దాలినాయుడు, వెలమల కామేశ్వరరావు, గొండు లక్ష్మణరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని పిఎన్ కాలనీలో నివాసముంటున్న పూర్వ డిప్యూటీ కలెక్టర్, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు తండ్రి నర్సింగరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు పరామర్శించారు. ఆయనతో పాటు టిడిపి నాయకులు మెండ దాసునాయుడు ఉన్నారు. అంతకుముందు పిఎన్ కాలనీలో ఇటీవల మృతి చెందిన సీపాన లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులనూ పరామర్శించారు.

మాజీ ఎమ్మెల్యే...

కొత్తూరు : మండలంలోని హంసకు చెందిన పప్పు నరసింహులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ మృతుడు కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. అలాగే కలిగాం సర్పంచ్ సనపల కోటేశ్వరరావు నాన్నమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని ఇరు కుటుంబాలకూ తెలిపారు. ఈయనతో పాటు టిడిపి మండల అధ్యక్షులు పాత్రుకొండ మోహనరావు, ఎంపిటిసి వి.గోవిందరావు ఉన్నారు.


చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

హియరింగ్ హ్యాండీక్యాఫ్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎన్నిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న హియరింగ్ హ్యాండీక్యాప్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఉప్పలపాటి ప్రసాద్ ఎన్నికయ్యారు. నగరంలోని ఎన్‌జిఒ హోమ్‌లో అసోసియేషన్ జిల్లాశాఖ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షులుగా ఉప్పలపాటి ప్రసాద్, సహాధ్యక్షునిగా కె.శ్రీనివాసరావు, మహిళా విభాగం ఉపాధ్యక్షులుగా ఎం.సుజాత, ప్రధాన కార్యదర్శిగా గొరుగంటుల రవిశంకర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎ.అశోక్ కుమార్, జాయింట్ సెక్రటరీగా ఎన్.ఎ.ఎన్.మూర్తి, మహిళా కార్యదర్శిగా ఎన్.దివ్య, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎస్.పావని, జి.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. కోశాధికారి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఎన్నిక జరగలేదు. ఎన్‌జిఒ సంఘం శ్రీకాకుళం యూనిట్ కార్యదర్శి బి.పూర్ణచంద్రరావు ఎన్నికల అధికారిగా, నరసన్నపేట యూనిట్ కార్యదర్శి కె.మోహనరావు అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. పరిశీలకునిగా ఆంధ్రప్రదేశ్ హియరింగ్ హ్యాండీకాప్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.కుమార్ వ్యవహరించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని ఎన్‌జిఒ సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, ఎపి హియరింగ్ హ్యాండీకాప్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి ఎం.విశ్వేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎ.కన్నా, ఉప్పలపాటి నర్మజ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణలో బిసిలకు న్యాయం చేయాలి


కృష్ణమోహన్‌ను సన్మానిస్తున్న బిసి సంఘ నాయకులు

శ్రీకాకుళం అర్బన్ : ఆంధ్రా ప్రాంతం నుంచి బతుకుతెరువు కోసం హైదరాబాద్, ఇతర తెలంగాణా జిల్లాల్లో స్థిరపడిన బిసిలను జాబితా నుంచి తొలగించడం అన్యాయమని, 26 తరగతులను తిరిగి బిసిల జాబితాలో చేర్చాలని బిసి సంఘం నాయకులు పిట్టా చంద్రపతి, బాడాన దేవభూషణరావు, మూల నారాయణరావు, వాన కృష్ణచంద్ అన్నారు. తెలంగాణ బిసి కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ శనివారం జిల్లాలో పర్యటన సందర్భంగా యనను కలిసి వినతిపత్రం అందజేశారు. ముందుగా ఆయన అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించారు. అనంతరం బిసి సంఘాల ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన జ్యోతిరావు పూలే పార్కును సందర్శించారు. అనంతరం ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన కాళింగ, పోలినాటి వెలమ, తూర్పుకాపు, శెట్టి బలిజ, ఒంటరి తదితర 26 తరగతులను బిసిల జాబితా నుంచి తొలగించడం అన్యాయమన్నారు. ఆర్థికంగా వెనుకబాటుతనం ఉండి వలస వచ్చి జీవనం సాగిస్తున్న కుటుంబాలను బిసిల జాబితా నుంచి తొలగించడంతో ఆర్థికంగా మరింత ఇబ్బందులు పడాల్సి వస్తోందని వివరించారు. అనంతరం ఆయనకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు జంజూరి రామారావు, ఎన్.దుర్గారావు, కంఠవేణు, బొడ్డేపల్లి దామోదరరావు, కాళ్ల వేణు, బిసి సంక్షేమ శాఖాధికారి ఇ.అనురాధ పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలి

ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అశోక్

ప్రజాశక్తి- కవిటి

ప్రభుత్వం సొంత పత్రిక, సోషల్ మీడియా ద్వారా ప్రజల్లో కల్పిస్తున్న అభూత కల్పనలను టిడిపి కార్యకర్తలు ఎండగట్టాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ పిలుపునిచ్చారు. మండలంలోని రామయ్యపుట్టుగలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆర్‌టిఎస్‌పై నియోజకవర్గస్థాయిలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు వాస్తవాలు తెలియజేసి, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి ఇప్పటి వరకు చేసిన, చేస్తున్న అన్యాయాలు, అక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వం గోరంతను కొండంత చూపిస్తుందని,గతంలో ఉన్న పథకాల పేర్లు, ఫొటోలు మార్చి కాలం వెల్లదీస్తుందని విమర్శించారు. ఈ విషయాన్ని క్షేత్రస్థాయిలో ప్రజలకు అర్థమయ్యేలా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో శిక్షకులు పీరుకట్ల విఠల్, విమల, సంతోష్, నియోజకవర్గంలోని నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, కమిటీ సభ్యులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, సభ్యులు, ఏరియా, క్లస్టర్, యూనిట్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

ఆర్‌టిసి విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న శర్మ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆర్‌టిసి ఉన్నతికి సుదీర్ఘ కాలం పాటు శ్రమించి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.అప్పారావు, ఎస్.ఎస్.ఆర్.శర్మలు డిమాండ్ చేశారు. నగరంలోని ఆర్‌టిసి విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఆర్.పి.రావు అధ్యక్షతన శనివారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇపిఎస్ 95 పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.7,500, డిఎ చెల్లించాలన్నారు. ఇఎస్ఐ, మెడికల్ సదుపాయం కల్పించాలన్నారు. సుప్రీం కోర్టు ఉత్తర్వులను అనుసరించి 2014 తర్వాత ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు హయ్యర్ పెన్షన్ చెల్లించాలన్నారు. అర్హత గలిగిన వారికి సిఎల్ గ్రాట్యూటీ చెల్లించాలన్నారు. సూపర్ లగ్జరీ వరకు విశ్రాంత ఉద్యోగులకు ఉచిత ప్రయాణానికి అనుమతులు ఇవ్వాలన్నారు. విశ్రాంత ఉద్యోగులు మృతి చెందితే వారి దహన ఖర్చులు రూ.25 వేలుకు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్యదర్శి కొర్లాం గణేశ్వరరావు, ప్రసాద్, రామారావు, సత్యం, పాపయ్య, రుషి, చిన్నారావు పాల్గొన్నారు.

'జగనన్న ఇళ్ల పేరుతో కుచ్చుటోపీ'

ప్రజాశక్తి- ఆమదాలవలస

జగనన్న ఇళ్ల పేరుతో ప్రభుత్వం జనాలకు కుచ్చుటోపి పెడుతుందని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు విమర్శించారు. మండలంలోని గాజులు కొల్లివలసలో లబ్ధిదారులకు ప్రభుత్వం అందజేసిన జగనన్న ఇళ్ల స్థలాల వద్ద శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం లక్షలాది గృహాలను మంజూరు చేశామని చెబుతుందని, తీరా ఇక్కడ చూస్తే గృహాలే కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. ఇప్పటివరకు దాదాపు 50 శాతం ఇళ్లను పూర్తి చేశామని చెబుతూ పేదలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద విడుదల చేస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్నట్లు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు.

సంతబొమ్మాళి : మండలంలోని నౌపడ పంచాయతీ, సంతబొమ్మాళి పంచాయతీ లక్ష్మీపురం టౌన్‌షిప్, గోవిందపురం పంచాయతీల్లో రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన అందజేసిన జగనన్న ఇళ్ల స్థలాల వద్ద నిరసన తెలిపారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్, గవరయ్య, శ్రీను, త్రివేణి, కుమారస్వామి, గణపతి, చిరంజీవి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలోని జగనన్న, టిడ్కో ఇళ్ల కాలనీల వద్ద జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఆర్.భాస్కరరావు, సంతోష్ మహారాణ, కళ్యాణ్ గౌడు, దాసరి శేఖర్, డి.భాస్కర్‌రెడ్డి, కామేష్, శివ, అకిరా, మణి, ఢిల్లీ పాల్గొన్నారు.


ఆమదాలవలస : నిరసన తెలుపుతున్న నాయకులు


సంతబొమ్మాళి : నిరసన తెలుపుతున్న నాయకులు


ఇచ్ఛాపురం : నిరసన తెలుపుతున్న నాయకులు

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

నందిగాం: మండలంలోని కొండల ప్రాంత గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి అన్నారు. మండలంలోని దిమ్మిడిజోల, దీనబంధుపురం గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ గ్రామాల్లో ఇంటింటికీ తాగునీటి సదుపాయం కల్పించడం, కాలువలు, సిసి రోడ్ల నిర్మాణం వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని అన్నారు. గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. దిమ్మిదిజోలలో ఆర్‌బికె నిర్మాణ పనులు, దీనబంధుపురంలో కాలువ నిర్మాణ పనులు, తమలాపురంలో నిర్మించిన సిసి రోడ్డు, చెరువు గట్టు మెట్లు నిర్మాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, సర్పంచ్ మండపాల సంజీవరావు, వైస్ ఎంపిపి ప్రతినిధి ఆర్.కూర్మారావు, ఎంపిటిసి ప్రతినిధి అంబోడి విష్ణు పాల్గొన్నారు.

పలువురిని పరామర్శ

మండలంలోని దిమ్మిడిజోల, దీనబందపురం గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను ఎంపిపి, పిఎసిఎస్ అధ్యక్షులు పరామర్శించారు. దిమ్మిడిజోలకు చెందిన వైసిపి నాయకులు సీరపు నాగిరెడ్డి తండ్రి కామయ్యరెడ్డి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. దీనబంధుపురానికి చెందిన పోలాకి రాములమ్మ మృతి చెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈయన వెంట వైఎస్ ఎంపిపి ప్రతినిధి ఆర్.కూర్మారావు, సర్పంచ్ మడపాల సంజీవరావు, ఎంపిటిసి అంబోడి విష్ణు ఉన్నారు.


కాలువ పనులను పరిశీలిస్తున్న ఎంపిపి శ్రీరామ్మూర్తి

దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం

ప్రజాశక్తి- పలాస

దళితులపై సామాజిక, ఆర్థిక, అణచివేత, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుదామని కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు దుడ్డు ప్రభాకరరావు పిలుపునిచ్చారు. మండలంలోని రైల్వే ఇనిస్టిట్యూట్‌లో కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బెలమర ప్రభాకర్ అధ్యక్షతన ఆరో మహాసభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో అత్యధిక సముద్ర తీరం, విస్తారంగా అడవులు, నీటి వనరులు, ఖనిజ సంపద సమృద్ధిగా ఉన్నా పాలకుల నిర్లక్ష్యంగా కారణంగా జిల్లాలో వలసలు ఎక్కువగా ఉన్నాయన్నారు. మెళియాపుట్టి మండలం సవరశేఖరపురం, పలాస మండలం రెంటికోట, టెక్కలి మండలం మనుసబుపేట గ్రామాలకు చెందిన దళితులు మూడు తరాలుగా భూములను సాగు చేసుకుంటున్నారని, వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అవుతున్నా... ఇప్పటికీ కుల వివక్ష అనేక రూపాల్లో నిరాటంకంగా అమలవుతుందన్నారు. గత ప్రభుత్వాలు దళితుల సంక్షేమానికి అమలు చేస్తున్న 23 పథకాలను సిఎం జగన్ నిలిపివేశారని అన్నారు. ఈ ప్రభుత్వంలో దళితులపై దాడులు పెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుల మిస్కా కృష్ణయ్య, ఎన్.వేణుగోపాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తుందన్నారు. మోడీ, అమిత్‌షా అమలు చేస్తున్న కార్పొరేటీకరణ, కాషాయికరణకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న ప్రభాకరరావు

క్రీడాకారులకు అభినందనలు

నందిగాం : మండలంలోని లఖిదాసుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు వంకల గణేష్, శాసనపురి సాద్విక్‌లు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు చిలుకు కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు క్రీడాకారులను శనివారం అభినందించారు. ఇటీవల నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారుషీ మేరకు వ్యాయామ ఉపాధ్యాయులు యాగాటి త్రినాథరావుకు, విజేతలకు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బాలక రామారావు, ఇందిరాభాయ్, బెందాళం రత్నం, తులసీప్రసాద్, రంకిడి రామారావు, ప్రియదర్శినిలు పాల్గొన్నారు.


అభినందిస్తున్న ఉపాధ్యాయులు


శంకుస్థాపన చేస్తున్న రాజ్యలక్ష్మి

పైపులైన్ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలోని కొండివీధిలో పైపులైన్ పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి శనివారం శంకుస్థాపన చేశారు. వార్డు ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీరు సక్రమంగా రాకపోవడం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కౌన్సిలర్ స్వర్ణమణి కౌన్సెల్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో 14వ ఆర్థిక సంఘం నుంచి రూ.2 లక్షలు నిధులు మంజూరు చేశారు. పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ దుర్గాహరిమోహన్, మాజీ కౌన్సిలర్లు లాభాల శంకర్‌కుమార్, లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.



డాన్సులు చేస్తున్న చిన్నారులు

ఆకట్టుకున్న డాన్సు పోటీలు

శ్రీకాకుళం అర్బన్ : జోష్ శివ డాన్స్ అకాడమీ వార్షికోత్సవం సందర్భంగా నగరంలోని బాపూజీ కళామందిర్‌లో మెగా డాన్స్ షో పోటీలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలను నృత్య దర్శకులు డాక్టర్ రఘుపాత్రుని శ్రీకాంత్ జ్యోతి ప్రజ్వళన చేసి ప్రారంభించారు. మాస్టర్ జోష్‌శివ ఆర్గనైజర్ సాయిబాబా బృందం, కాయల శివకుమార్ నృత్యానికేతన్ చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనతో పోటీలు ప్రారంభమయ్యాయి. సినీ అభిమానులను మంత్ర ముగ్ధులను చేసే పలు పాటలకు చిన్నారులు డాన్సు వేశారు. కార్యక్రమంలో దంత వైద్య నిపుణులు డాక్టర్ కమల్ విలేకరి, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.కిరణ్ కుమార్, ఐ.ఆర్.ఎస్.కృష్ణారావు, బి.లక్ష్మణరావు, కోరాడ హరగోపాల్ పాల్గొన్నారు.


రగ్గులను అందజేస్తున్న మహరాజ్

రగ్గుల పంపిణీ

టెక్కలి రూరల్ : మండలంలోని మేఘవరం పంచాయతీలోని 9 గిరిజన గ్రామాల్లో విశాఖపట్నం రామకృష్ణ మిషన్ ఆశ్రమ ఆధ్వర్యాన స్వామి గీత సారానందజీ మహరాజ్ శనివారం పాల్గొని రూ.86,100 విలువైన 410 మందికి ఉన్నిరగ్గులను పంపిణీ చేశారు. జీడిపేట, వంగర, చిన్నభీంపురం, కొత్తూరు, పెద్దభీంపురం, కోదండపురం, డెప్పూరు, సరియాపల్లి, జక్కంపేట గ్రామాల్లో ఇంటికో ఉన్నిరగ్గును అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కన్వీనర్ ఎస్.విశ్వనాథ, టెక్కలి సేవాశ్రమ ప్రతినిధులు చింతాడ పాపారావు, రట్టి ప్రకాశరావు, షాహుకారి కామేశ్వరరావు, ధనుంజయ, సంపతిరావు పార్వతీశం, రమేష్ పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

శ్రీకాకుళం అర్బన్ : సాంకేతిక మార్పులను ఫొటోగ్రాఫర్లు అందిపుచ్చుకోవాలని ఫొటో, వీడియో గ్రాఫర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మెట్ట నాగరాజు పిలుపునిచ్చారు. నగరంలోని ఓ ప్రయివేటు హోటల్‌లో ఫొటో ఎక్స్‌పో పోస్టరును శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫొటోగ్రఫీలో ఎప్పటికప్పుడు మార్పులు వస్తున్నాయని, మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంపై అవగహన పెంచుకోక పోతే వృత్తిలో రాణించడం కష్టసాధ్యమవుతుందని అన్నారు. ఆధునిక పరిజ్ఞానం పెంచుకోవడం ద్వారా వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవడంతో పాటు నాణ్యత గల ఫొటోలను అందించగలమన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫొటో టెక్ ఆధ్వర్యాన ఈ నెల 18 నుంచి 20 వరకు హైదరాబాద్‌లోని ఎల్‌బి నగర్‌లో నిర్వహిస్తున్న ఫొటో ఎక్స్‌లో కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఫొటోగ్రాఫర్లు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పక్కి వేణు, విస్సు, వెంకటేష్, ఉదయ్, శ్రీను, కోటి, పరమేష్, కుమార్, లక్ష్మణ, మురళి, తేజ, కృష్ణ, రమణ, చలం, అరబింద్, రాంబాబు పాల్గొన్నారు.


బోరు పనులను పరిశీలిస్తున్న రామారావు

ఎంపీ నిధులతో బోరు నిర్మాణం

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని డోలగోవిందపురం పంచాయతీ రేఖాదేవీపురంలో ఎంపీ నిధులతో బోరు పనులను టిడిపి కార్యదర్శి మాదిన రామారావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు సమకూర్చిన రూ.1.50 లక్షల నిధులతో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామాల్లో తాగునీటి కల్పనకు ఎంపీ నిధులు మంజూరు కోరామని పేర్కొన్నారు. ఇందుకు సహకరించిన స్థానిక ఎమ్మెల్యే అశోక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.


మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న మెరైన్ పోలీసులు

అపరిచితులపై అప్రమత్తం

ప్రజాశక్తి- సోంపేట

సముద్ర తీర ప్రాంతం వెంబడి గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే సమాచారం ఇవ్వాలని మత్స్యకారులను బారువ మెరైన్ సిఐ డి.వి.జె.రమేష్ కుమార్ కోరారు. ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించనున్న సాగర్ కవచ్ (సివిజిల్) కార్యక్రమంలో భాగంగా మత్స్యకారులకు శనివారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా మెరైన్ సిబ్బందికి నరేన్ రక్షక పరికరాల పనితీరుపై పున:శ్చరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐలు శ్రీనివాసరావు, శిరీష పాల్గొన్నారు.